## గోదావరిలో మహిళ మృతదేహం

మంచిర్యాల అర్బన్, మే 18: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. శనివారం వారు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన మహిళ గోదావరిలో నీట మునిగి చనిపోయి ఉంటుందని, ఆమె వయసు దాదాపు 35 సంవత్సరాలుంటుందని, మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు. మహిళ ఆచూకీ తెలిస్తే 87126 56534, 93905 60335 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మంచిర్యాల అర్బన్, మే 18: మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం వారు తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం మంచిర్యాలలోని రైల్వే స్టేషన్ వద్ద అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికులు 108కు సమాచారం అందించగా చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు, మృతదేహాన్ని దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు.

## పేకాడిన నలుగురి అరెస్ట్



పట్టుబడ్డ వారితో మందమర్రి పోలీసులు

రామకృష్ణాపూర్, మే 18: మందమర్రి పోలీస్టేషన్ పరిధిలోని విద్యానగర్ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసి నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారు మోతే రాజయ్య (రాజన్నల వాడ), తుంగపిండి వినోద్(విద్యానగర్), గరికె అశోక్ కుమార్ (విద్యానగర్), పంచమట్ల శ్రీకాంత్ (విద్యానగర్) మందమర్రికి చెందిన వారున్నారు. పారిపోయిన వారిలో పైడి పవన్ (విద్యానగర్), పాస్తం గోపాల్ ( విద్యానగర్) పూల కోటేశ్ ఉన్నారు. పట్టుబడ్డ వారి నుంచి రూ 15,150 లు, నాలుగు మొబైల్ ఫోన్స్, 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ దాడిలో మందమర్రి ఏఎస్ఐ మిలింద్‌కుమార్, కానిస్టేబుళ్లు గోపాల్, రాకేశ్, విశ్వనాథ్, కృష్ణ, హోంగార్డ్ రవి పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం

వాంకిడి, మే 18: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. వాంకిడి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వాంకిడి మండలంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం ఆర్లీ గ్రామానికి చెందిన లెండుగురే రాజు అనుమానాస్పదంగా ఆటో కోసం వేచిచూస్తుండగా అనుమానంతో అతని వద్ద తనిఖీ చేయగా 200 గ్రాముల మూడు ప్యాకెట్లు ఎండు గంజాయి లభించిందని తెలిపారు. దీనికి విలువ రూ.6250 ఉంటుందని పేర్కొన్నారు. వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్ మండల యువకులకు విక్రయిస్తున్నాడని స్పష్టం చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## మేధా ట్రస్టుకు ఎంపిక

దండేపల్లి, మే 18: దండేపల్లి మండలంలోని ద్వారక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముత్యాల మనీష మేధా ట్రస్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం చిన్న నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా ఆరు సంవత్సరాల వరకు విద్యార్థినికి హాస్టల్, ట్యూషన్ ఫీజు ఉచితంగా అందించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు

## ఆటో బోల్తా నలుగురికి గాయాలు



బోల్తాపడిన ఆటో

రెబ్బెన, మే 18: రెబ్బెన మండలం పెద్దవాగు సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడడంతో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న ఆటో ఒక్కసారి అదుపుతప్పి బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న ఇందిరానగర్ గ్రామానికి చెందిన లక్ష్మి, జక్కులపెల్లికి చెందిన శంకరమ్మ, విమలబాయితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో 108 ఈఎంటీ అజయ్‌కుమార్, ఫైలట్ అరవింద్ కాగజ్‌నగర్ లోని దవాఖానకు తరలించారు. ఈ విషయమై రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## చెరువులో గడ్డి మందు కలిపిన వారిపై చర్యలు తీసుకోవాలి



చెరువులో గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిపోతున్న గుర్రపు డెక్క



రంగు మారిన చెరువు నీటిని చూపిస్తున్న గ్రామస్తుడు

హాజీపూర్, మే 18 : మండలంలోని టీకన్నపల్లి గ్రామ శివారులో ఉన్న చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు కలిపారని గ్రామస్తులు తెలిపారు. గుర్రపు డెక్కను కూలీలతో తొలగించకుండా హాజీపూర్ గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు చెరువులో డ్రోన్ ద్వారా గడ్డి మందును పిచికారీ చేశారని తెలిపారు. మందు కలిపిన నీరంతా నల్లగా మారిందన్నారు. ఆ నీటిని తాగిన పశువులు, బర్రెలు, మేకలు, గొర్రెలు అస్వస్థతకు గురవుతున్నాయని తెలిపారు. చెరువులో బట్టలు ఉతికే చాకలి కులస్తులు కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నీటి పారుదల, మత్స్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి చెరువులో గడ్డి మందును కలిపిన సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## 'మాకు న్యాయం చేయండి'




మాట్లాడుతున్న రాజబాబు-స్వప్న దంపతులు

సీసీసీ నస్పూర్, మే 18: తమపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సజ్జనపు సంపత్, ఏల్పుల సంపత్ నుంచి తమకు ప్రాణభయం ఉందని, ఈ విషయంలో పోలీస్ అధికారులు తమకు న్యాయం చేయాలని నస్పూర్‌కు చెందిన మంతెన రాజబాబు-స్వప్న దంపతులు పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తీగల్‌పహాడ్‌లోని విలేజ్‌శ్రీరాంపూర్‌లో సజ్జనపు జగదీశ్ వద్ద వడ్రంగి పని చేస్తున్నానని రాజబాబు తెలిపాడు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటారం నుంచి వచ్చి చింతకింది మల్లేశ్ ఇంట్లో తాము అద్దెకు ఉంటున్నామని, తమ ఇంటి పక్కన బండారి వెంకటేశ్ అనే వ్యక్తి కిరాణం షాపు పెట్టి తీసేయడంతో అందులోని కొన్ని కబోర్డులు ఏల్పుల సంపత్ కొని తమ ఇంట్లో ఖాళీగా ఉన్న ప్రదేశంలో కబోర్డులను పెట్టాడని తెలిపారు. ఇంటి యజమాని మందలించడంతో తాము ఏల్పుల సంపత్‌కు సంబంధించిన కబోర్డులను బయట పెట్టడడంతో ఏల్పుల సంపత్‌తో పాటు ఆయన మామ సజ్జనపు సంపత్ తమపై దాడి చేసి కులం పేరుతో దూషించారని తెలిపారు. దీంతో తాము సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పోలీస్ ఉన్నతాధికారులను కలువడంతో వారిపై కేసులు పెట్టారని చెప్పారు. ఈనెల 16న మరోసారి సజ్జనపు సంపత్, ఏల్పుల సంపత్ తనను తీవ్రంగా కొట్టి, తనపైనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపాడు. దాడి విషయాన్ని పోలీసులకు చెబితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సజ్జనపు సంపత్, ఏల్పుల సంపత్ నుంచి తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

## వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోండి



టీఎస్‌టెట్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డా.శంకర్ లాల్ లాహోటీ

చెన్నూర్ టౌన్, మే 18 : ప్రతి ఒక్కరూ వర్క్‌షాప్, ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డా.శంకర్ లాల్ లాహోటీ సూచించారు. చెన్నూర్ పట్టణంలోని చోటాహనుమాన్ ఆలయం ఎదురుగా ఉన్న అంజుమన్ సాంబయ్య భవన్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మహావాది సుభాష్ నిర్వహిస్తున్న ఉచిత వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహావాది సుభాష్ చాలా విజ్ఞాన వంతుడు అని, విరమణ తర్వాత కూడా సమాజ సేవ చేయాలను కోవడం గొప్ప విషయమని కొనియాడారు. అనంతరం రిటైర్డ్ ప్రొ.మహావాది సుభాష్ మాట్లాడుతూ ఆంగ్ల భాషలో వర్క్‌షాప్, క్రాష్ కోర్సు, టీఎస్ టెట్ వారికి ఇంగ్లిషుతో పాటు ఆంగ్ల భాషపై పట్టు కోసం పలువురు విద్యార్థులకు ఉచితంగా చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కే.సౌజన్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్, టీఎస్ టెట్ కోచింగ్ అభ్యర్థులు, విద్యార్థులు, పట్టణ ప్రజలున్నారు.

## నకిలీ విత్తనాలు కొనుగోలు చేయవద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్యామ్‌పటేల్

వేమనపల్లి, మే 18 : ప్రభుత్వం నిషేధించిన నకిలీ విత్తనాలతో పాటు గ్లైసిల్ గడ్డి మందు వాడవద్దని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముల్కలపేట గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను ఎవరూ కొనుగోలు చేయవద్దని, లైసెన్స్ ఉన్న విత్తనాల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. గ్లైసిల్ గడ్డిమందు వాడడం వల్ల పర్యావరణ దెబ్బతింటుందని, రైతులకు అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రిజిష్టర్‌లు, ఎరువుల, విత్తనాల నిల్వలను పరిశీలించారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, రైతులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ ఎన్నిక



పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కాసిపేట, మే 18 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి గుడి కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం యాదవ కులస్తులు యాదవ భవనం వద్ద సమావేశమై గుడి కమిటీని ఎన్నుకోవడంతో పాటు పలు సమస్యలపై చర్చించారు. కమిటీ గౌరవ అధ్యకుడిగా బోయిని తిరుపతి యాదవ్, అధ్యక్షుడిగా మరం లచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షుడిగా వేల్పుల రవి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఏల్పుల అనిల్ కుమార్ యాదవ్, కోశాధికారిగా రేశవేణి స్వామి యాదవ్, జాయింట్ సెక్రటరీగా బోయిని హనుమంత్ యాదవ్, ప్రచార కార్యదర్శిగా మారం కుమార్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులను కులస్తులు ఘనంగా సన్మానించారు. అందరి సహకారంతో గుడి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల యాదవ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రేషవేని ఓదెలు యాదవ్‌ను యాదవులు సన్మానించారు.

# రైతు కష్టం..'నీళ్ల' పాలు

- అకాల వర్షాలకు నేలవాలిన వరి చేలు
- రాలిపోయిన మామిడి కాయలు
- నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



నీట మునిగిన వరి పైరును చూపిస్తున్న రైతు

నెన్నెల, మే18: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అకాల వర్షం నట్టేట ముంచింది. చేతికి వస్తుందనుకున్న పంట కండ్ల ముందే కానరాకుండా పోతున్నది. రూ.లక్షల్లో నష్ట పోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఏ పొలం చూసినా రైతుల గోసే కనబడుతున్నది. కోతకు వచ్చిన పొలం వడగండ్లు, అకాల వర్షంతో చేతికి రాకుండా పోయిందని రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. నెన్నెల మండలంలోని పలు గ్రామాల్లో వర్షంతో వరి పంట సాగు చేసిన రైతుల స్థితి అగమ్యగోచరంగా మారిం ది. వర్షంతో ఒక్క గొల్లపల్లిలోనే రెండు వందల ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతిన్నది. వరి కంకులు బురదలో చిక్కుకోగా మరికొన్ని నీటిలో తేలుతున్నాయి. వరి పైరు పూర్తిగా నేల పాలు కావడంతో హార్వేస్టర్ కూడా కోయలేని పరిస్థితి నెలకొన్నది. ఇంత పెద్ద మొత్తంలో పంట దెబ్బతింటే రైతులను ఆదుకునే వారు లేరని, నష్టపరిహారం అందించే దిక్కు లేదని వాపోయారు. అటు మామిడి తోటల్లో కాయలు కూడా రాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

**ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు న్యాయం జరగడంలేదు. పంట కోసి కేంద్రానికి తీసుకుపోతే అక్కడ కనీస సదుపాయాలు ఉండడం లేదు. టార్పలిన్ లేక పోవడంతో ధాన్యం బస్తాలు తడవాల్సిన పరిస్థితి ఉంది. కేంద్రాల్లో ధాన్యం కుప్పలు నెలల తరబడి ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. సకాలంలో గన్ని బ్యాగులు లేక వాటి కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. తూకమైన ప్పటికీ లారీల్లో లోడ్ అయ్యే వరకు రైతునే బాధ్యుడిని చేస్తున్నారు. తూకం వేస్తున్నప్పుడు కేంద్రాల్లోనే ఒకో బ్యాగుకు రెండు కిలోలు తీసుకుంటున్నారు. తీరా మిల్లుకు చేరాక అక్కడ మరో రెండు నుంచి మూడు కిలోలు తీసుకుంటున్నారు. నాలుగు రోజుల కిందట ఇక్కడి నుంచి కరీంనగర్‌లోని ఒక మిల్లుకు ధాన్యాన్ని పంపితే మిల్లరు బ్యాగుకు మూడు కిలోలు కట్ చేస్తానని లేదంటే తిరిగి పంపిస్తానని చెప్పడంతో చేసేదేమీలేక మిల్లరు అన్నట్లు ఇచ్చుకోవాల్సి వచ్చిందని కొందరు రైతులు వాపోయారు.

**అందని నష్టపరిహారం..!**

అకాల వర్షంతో నష్ట పోయిన రైతును ఎవరు ఆదుకుంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో పంటసాయమన్న ఉండేదని కాని ఇప్పుడేదీ లేదని రైతులు వాపోతున్నారు. రైతు బంధు కింద ఎకరానికి రూ.5000 అందేవి కొంతలో కొంతన్న రైతులకు సాయ పడ్డట్లు జరిగేది. కానీ ఇప్పుడు ఎంత నష్ట పోయినా మాత్రం నయా పైసా సాయం అందడం లేదని రైతులు అంటున్నారు. గతంలో రైతులు పంటల రుణాలు తీసుకుంటే పంటల బీమాను బ్యాంకులు కట్టించుకునేవి. ఎలాంటి బీమా లేకపోవడంతో మరింత నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



నేలవాలిన వరి చేనును చూపిస్తున్న రైతులు

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్ స్పాట్స్ ప్రదేశాలను పరిశీలించిన పోలీస్, ఎన్‌హెచ్ఏఐ శాఖల అధికారులు



తాండూర్‌లో జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్స్ ప్రదేశాలు పరిశీలిస్తున్న ఎస్ఐ, అధికారులు

తాండూర్, మే 18 : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తాండూర్ ఎస్ డీ కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలైన బ్లాక్ స్పాట్ ప్రదేశాలను ఎస్ఐ కిరణ్‌కుమార్ నేషనల్ హైవే అథారిటీ అధికారులు అజయ్, సునీల్‌తో కలిసి బోయపల్లి నుంచి రేపల్లెవాడ వరకు పరిశీలించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అదే విధంగా వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను, రోడ్డు మధ్యలో లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుపై తెలిపారు. హైవే అధికారులు సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. జాతీయ రహదారికి సమీపంలో గల గ్రామాల ప్రజలు రోడ్డును నిర్దేశిత ప్రదేశంలో మాత్రమే దాటాలని, రైతులు వారి పశువులను రోడ్ల పైకి విడిచిపెట్టరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు, సూచనలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## మంత్రి శ్రీధర్‌బాబు క్షమాపణ చెప్పాలి

తాండూర్/బెల్లంపల్లి, మే 18 : మంత్రి శ్రీధర్‌బాబు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు క్షమాపణ చెప్పాలని మాల మహానాడు ఆఫ్ ఇండియా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పేరుని చేర్చకుండా అవమాన పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వంశీకృష్ణ పేరును చేర్చకుండా అవమాన పరచడం అమానుషమన్నారు. ప్రొటోకాల్‌ను ఉద్దేశపూర్వగానే తుంగలో తొక్కారని ఆరోపించారు. చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్‌ను సైతం సరస్వతి పుష్కరాలకు ఆహ్వానించకుండా విస్మరించారని విమర్శించారు. దళిత సామాజిక వర్గం అంటే మంత్రి శ్రీధర్‌బాబుకు అంతా చులకన అయిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, శ్రీనివాస్, రాజనర్సు, అమృత, ప్రకాష్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం మోడీ, బీహార్ సీఎం దిష్టి బొమ్మల దహనం

కాసిపేట, మే 18 : సోమగూడెం భరత్ కాలనీలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోడీ, బీహార్ సీఎం దిష్టి బొమ్మలను దహనం చేశారు. మోడీ సర్కార్ బీహార్‌లోని అంబేద్కర్ హాస్టల్లో దళిత విద్యార్థులను రాహుల్ గాంధీని కలవనీయకుండా పోలీసులతో అడ్డుకోవడంపై నిరసన తెలిపారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ రత్నం ప్రదీప్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు భామండ్ల రాకేశ్, నాయకులు, తదితరులున్నారు.

## అడ్మిషన్లు ప్రారంభం

దండేపల్లి, మే 18: దండేపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభమైయ్యాయని ప్రత్యేకాధికారి మంజుల ఆదివారం ప్రకటనలో తెలిపారు. 6, 7, ఇంటర్‌తో పాటు ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్ కోర్సుల కోసం 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హతగల విద్యార్థులు అడ్మిషన్లు పొందాలన్నారు. విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాఠశాలలో సంప్రదించాలన్నారు.

## అండర్-17 బాక్సింగ్ ఎంపిక పోటీలు



బాక్సింగ్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యుడు మైసూర్

సీసీసీ నస్పూర్, మే 18: నస్పూర్‌లో మంచిర్యాల జిల్లా అండర్-17 బాల బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు మైసూర్, పాదం రవీందర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి, ఈ నెల 24 నుంచి 26 వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మంచిర్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో సబ్ జూనియర్స్ కేటగిరీలో కూడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అటవీ చట్టాలపై సిబ్బందికి అవగాహన



ఇందన్‌పెల్లి రేంజ్ సిబ్బందితో న్యాయవాదులు

జన్నారం, మే 18 : డివిజన్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్ కార్యాలయంలో రేంజ్ సిబ్బందికి అటవీ చట్టాలపై మంచిర్యాలకు చెందిన న్యాయవాదులు శివశంకర్, తిరుపతి, ఎన్‌జీవో సభ్యుడు వెంకట్ అవగాహన కల్పించినట్లు రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా వన్యప్రాణులను హతమార్చిన వేటగాళ్లు, కలప స్మగ్లర్లు, అనుమతులు లేకుండా అడవిలోకి వెళ్లే వారిపై ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి, వారికి పడే శిక్షలను సిబ్బందికి వివరించారు.

## సమస్యలపై నిరంతర పోరు



జెండా ఆవిష్కరిస్తున్న బద్రి సత్యనారాయణ

రెబ్బెన, మే 18: సమస్యలపై సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గోలేటిటౌన్‌షిప్ లో గల కేఎల్ మహేంద్రభవన్ లో సిపిఐ పార్టీ నాలుగవ మహాసభ నిర్వహించారు. జెండా ఆవిష్కరించి మాట్లాడారు. నిరుపేదలు, పీడిత ప్రజలు, కార్మికులు, కర్షకుల కోసం అలుపెరగకుండా సీపీఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.తిరుపతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌బాబు, జగ్గయ్య, సీపీఐ మండల కార్యదర్శి రాయళ్ల నర్సయ్య, పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, తదితరులున్నారు.

## అగ్రి డ్రోన్స్‌పై రైతులకు అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు, నాయకులు, గ్రామస్తులు

కాసిపేట, మే 18 : కాసిపేట మండలం ముత్యంపల్లి అంబేద్కర్ క్రీడా మైదానంలో ఆదివారం గగన్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అగ్రి డ్రోన్స్‌పై ఉచిత క్షేత్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. నిరుద్యోగ యువతకు, యువ రైతులకు, ఆదర్శ రైతులకు అగ్రి డ్రోన్స్‌తో లాభాలు, వాడకం, పిచికారీ చేసే విధానంపై అగ్రి డ్రోన్స్ నైపుణ్యం కలిగిన ప్రముఖులు పూర్తి స్థాయిలో వివరించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గగన్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## చేతి పంపు బాగుచేయించరు..!

- వారం రోజులుగా ప్రజల అవస్థలు



రాజుర గ్రామంలోని బొట్టుపల్లిలో నిరుపయోగంగా చేతిపంపు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 18: మండలంలోని రాజుర గ్రామంలోని బొట్టుపల్లిలోని చేతి పంపు వారం రోజులుగా పని చేయడం లేదని దీంతో తాగునీటికి తీవ్రమైన ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. దూరంలోని చేతి పంపు వద్ద నీళ్లు తీసుకువచ్చేందుకు ఇబ్బందిగా మారిందని, అధికారులు స్పందించి పంపు బాగుచేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా త్వరలో బాగు చేపిస్తమని చెప్పారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్, మే 18:కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీమిత్ర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు సుమిత్ర, గౌరవ అధ్యక్షుడు తిరుపతి, డాక్టర్ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## మిల్లు కాలుష్యంపై విచారణ జరపాలి

- మంత్రి కొండ సురేఖకు ఎమ్మెల్యే లేఖ

కాగజ్‌నగర్, మే 18: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లు నుంచి వెలువడే కాలుష్యంపై తక్షణ విచారణ జరిపి పట్టణ, ఆయా గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖకు ఆదివారం లేఖ రాశారు. మిల్లులో క్లోరిన్ గ్యాస్ లీకేజీ ఘటనలు తరచూ జరుగుతున్నాయని, దీంతో దుర్వాసన, కాలుష్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలుష్య నియం త్రణ మండలికి గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ నెల 15న క్లోరిన్ గ్యాస్ లీకేజీ కావడంతోనే సెక్యూరిటీ గార్డు వేణు తీవ్ర అస్వస్థతకు గురై ఈ నెల 16న మృతి చెందాడని పేర్కొన్నారు. వేణు గుండె పోటుతో మృతి చెందినట్లు యాజమాన్యం చిత్రీకరించిందన్నారు. సెక్యూరిటీ గార్డు మృతదేహానికి రాత్రికి రాత్రే స్వగ్రామానికి తరలించి అర్ధరాత్రి దహన సంస్కారాలు చేయడంలో అంతరార్థం ఏముందన్నారు. కాలుష్యంపై విచారణకు ఆదేశాలు జారీ చేస్తే పట్టణ ప్రజలు ముం దుకొచ్చి నిర్భయంగా నిజాలు చెబుతారని ఆ లేఖలో తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

కాగజ్‌నగర్, మే 18:యాసంగి వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని సీతానగర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం కారణంగా రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగి వరి సేకరణ టార్గెట్ 60 వేల మెట్రిక్ టన్నులు ఉంటే ఇప్పటివరకు సేకరించింది కేవలం1180 మెట్రిక్ టన్నులు మాత్రమేనని, అది టార్గెట్లో కనీసం రెండు శాతం కూడా పూర్తి కాలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలనిలేదంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, కాగజ్ నగర్ మండల అధ్యక్షులు పుల్ల అశోక్, నాయకులు కుందారపు సుమన్, గజ్జి రాకేశ్, తిరుపతి, మేడి కార్తీక్, నాగేందర్ సింగ్, ఎర్గటి విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షంతో ఇబ్బందులు

జైనూర్, మే 18 : జిల్లా వ్యాప్తంగా ఓ వైపు ఎండలతో ప్రజలు సతమతమవుతుంటే జైనూర్ మండలంలో భిన్న వాతావరణం నెలకొన్నది. రెండు రోజులుగా మండల వ్యాప్తంగా వర్షం కురియడంతో తరచూ విద్యుత్ సరఫరాల్లో అంతరాయం నెలకొనడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. దుక్కులు దున్నేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

## పశువులకు ముద్దచర్మ వ్యాధి



దహెగాంలో ముద్ద చర్మ వ్యాధితో బాధపడుతున్న పశువులు

దహెగాం, మే17 : మండలంలో పలు గ్రామాల్లోని పశువులకు(ఆవులు,ఎద్దులు) మద్దశర్మ(లంపీ స్కిన్) వ్యాధి సోకి బాధపడుతున్నాయి. గత కొన్ని రోజులుగా పశువులకు చర్మంపై మచ్చలుగా ఏర్పడి ఆ మచ్చలు బొబ్బలుగా మారి పుండ్లుగా మారుతున్నాయని రైతులు తెలిపారు. ఈ వ్యాధి పాక్స్ వైరస్ వల్ల వస్తుందని సకాలంలో వైద్యం అందించకుంటే వ్యాధి సోకిన పశువులు మృతి చెందే ప్రమాదం ఉంటుందని పలువురు పశువైద్య నిపునులు తెలిపారు. వెంటనే పశు వైద్యాధికారులు వైద్యం అందించి పశువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, మే 18 : కౌటాల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ అంజల్ కుమార్ ఆదివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని బెజ్జూర్ లైన్ బూస్టర్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు పనులు ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సీపీఐ మండల కమిటీ ఎన్నిక

రెబ్బెన, మే 18: రెబ్బెన మండల సీపీఐ పార్టీ కమిటీని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.తిరుపతి తెలిపారు. గోలేటి కేఎల్ మహేంద్రభవన్ లో సీపీఐ మండల, పట్టణ పార్టీ నాలుగవ మహాసభ జగ్గయ్య అధ్యక్షతన నిర్వహించి కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల కార్యదర్శిగా రాయిళ్ల నర్సయ్య, సహాయ కార్యదర్శిగా జగ్గయ్య, బుధాజీ, కోశాధికారిగా నారాయణ, గోలేటి పట్టణ కార్యదర్శిగా మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దుర్గం సాయి, అల్లాడి కోటి, కోశాధికారిగా చల్లూరి అశోక్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.